# ఆకలి తీరింది

-అత్తలూరి విజయలక్ష్మి

"ఒసేయ్... మొద్దూ... లే ఎంతసేపు నిద్ర? అవతల బోలెడు పనుంది... లే లే... ఆ పక్కలు మడత పెట్టకుని ఓ మూల తగలేసి, లోపలికిరా..." భ్రమరాంబ బిగ్గరగా అరుస్తూ, చేతిలో ఉన్న అట్లకాడతో గాఢనిద్రలో ఉన్న పార్వతి వీపుమీద ఒక్కటేసింది... పార్వతి ఉలిక్కిపడి, బిత్తరచూపులు చూస్తూ లేచి కూచుంది.

"ఏవిటే అలా దిక్కులు చూస్తావు... ఇవాళ ఇంట్లో పూజ ఉంది... త్వరగా లెమ్మని చెప్పానా రాత్రి... లే ఇంక..." మరోసారి బిగ్గరగా అరుస్తూ, లోపలికి వెళ్లిపోయింది భ్రమరాంబ...

పార్వతి మూసుకుపోతున్న కళ్లు బలవంతంగా తెరుస్తూ, బద్ధకం వదిలించుకుంటూ లేచి దుప్పటి మడతపెట్టసాగింది... దాని కళ్లు ససేమిరా తెరవనంటున్నాయి... రాత్రి పడుకునేటప్పటకి బాగా పొద్దుపోయింది... దాదాపు నాలుగు రోజుల్నుంచీ బోలెడంత పని... ఇంటికి చుట్టాలు, పక్కాలు రావడం, వాళ్లందరికీ నీళ్లు, కాఫీలు, టిఫిన్లు అందించడాలు... అంట్లు తోమడాలు, బట్టలు ఉతకడాలూ... పిల్లలని ఆడించడం... అసలు నిద్రపోడానిక్కూడా టైం ఉండడం లేదు... ఎలాగోలా పన్నెండు అవుతోంటే, ఎంతో జాలిగా పోవే పడుకో పో. పెందలాడే లేవాలి సుమా... అంటూ అమ్మగారు పడుకోడానికి పర్మిషన్ ఇస్తే... మెల్లిగా వరండాలో మూలకి తనకిచ్చిన చిరిగిన చాప పర్చుకుని, దానిమీద మరో చినిగిన దుప్పటి వేసుకుని, పడుకోగానే నిద్ర కమ్మేస్తోంది... మళ్లీ తెల్లవారకుండానే, చీకట్లు తొలగిపోకుండానే లేపేస్తున్నారు... చేసే పనికి, తీసుకుంటున్న విశ్రాంతి సరిపోవడం లేదు.

"ఏవే.. లేచి చచ్చావా? లేదా? త్వరగా వచ్చి ఈ గిన్నెలు తోమివ్వు..." భ్రమరాంబ స్వరం ఈసారి మరింత బిగ్గరగా వినిపించడంతో నిద్రాదేవత బెదిరి పారిపోయింది...

"వత్తునానమ్మగారూ..." అంటూ మడతపెట్టిన చిరుగుల దుప్పటి, చింకిచాప తీసుకుని, పెరటివైపు నడిచి, జామచెట్టు వెనకాల దాచుకుంది... ఆ రెండు వస్తువులు ఇంట్లో పెట్టకూడదు... అక్కడి నుంచి పెరట్లో ఓ మూలన ఉన్న చీకటి గదిలో, అయ్యగారు చేస్తున్న వ్యాపారం తాలూకు పనికిరాని చెక్క వస్తువులు దాచిన గదిలో దాచుకున్న తన పాలిథిన్ కవర్ తీసుకుని, బ్రష్షు, నాలికబద్ద, పేస్టు, తువ్వాలు తీసుకుని పంపు దగ్గరకు నడిచింది... పళ్లు తోముకుని, అక్కడే చలితో వణికిపోతున్న శరీరాన్ని బలవంతంగా చన్నీళ్లలో తడిసి స్నానం కానిచ్చింది. గౌను మార్చుకోబోతూ ఓసారి ఆలోచించింది... ఇవాళ పూజ ఉంది ఇంట్లో... ఇంటికి ఊళ్లనించి వచ్చిన అమ్మగారి పిల్లలు, వాళ్ల భార్యలు, పిల్లలు, అత్తగార్లు, మావగార్లు ఇతర బంధువులే కాక ఊళ్లో ఉండే అనేక మంది స్నేహితులు, చుట్టాలు వస్తారు... వాళ్లందరి ముందు తను చినిగిన గౌను వేసుకుని తిరగాలంటే మనసొప్పడం లేదు... అంతా ఖరీదైన బట్టల్తో, వంటి నిండా నగలతో ఉంటే తనెప్పుడూ చిరిగిన బట్టలు కట్టుకుని, చాకిరీ చేస్తూ, మంచినీళ్లు, కాఫీలు అందిస్తూ, ఆ ఎంగిలి గ్లాసులు, పళ్లాలు కడుగుతూ ఉండాల్సి వస్తోంది. ఈ పని ఎలాగా తప్పదు... కనీసం మంచి గౌనన్నా వేసుకోవాలి అనుకుంటూ కవర్లో దాచిన నాలుగు గౌన్లు కిందపారేసి, వాటిలో చిరుగులు లేని గౌను కోసం వెతికింది. ముదురు నీలం, లేత రంగుగా మారిన పాత గౌనొకట తీసుకుని వేసుకుంది. జడ వేసుకుని, పక్కింటి సుగుణనడిగి కాగితంలో పొట్లం కట్టి తెచ్చుకున్న పౌడర్ రాసుకుంది.. బొట్టు బిళ్ల మొహానికి తగిలించుకుని వంటగది గుమ్మం దగ్గరకు నడిచి "అమ్మగారూ... గిన్నెలిత్తారా?" అడిగింది...

"స్నానం చేసి చచ్చావా? ఆ పాచిమొహంతో తగలడ్డావా?" అడిగాననుకుంటూ అరిచింది భ్రమరాంబ...

ఈ అమ్మగారి గొంతు సన్నగా ఎప్పుడవుతుందో అనుకుంటూ "చేసానమ్మగారూ..." అన్నది.

"ఇలారా... ఇవి తీసికెళ్లి తోమి పెట్రా..." తలుపు దగ్గరగా పెద్ద స్టీలు గిన్నెలు రెండు, ఒక నాలుగు గిన్నెల గుత్తి, రెండు స్టీలు బకెట్లు తోసింది.

నిన్ననే ఉదయాన్నే వంటవాళ్లు వస్తారు గిన్నెలు కావాలి అంటూ టెంటు వాళ్ల దగ్గర అద్దెకు తీసుకొచ్చిన పెద్ద, పెద్ద ఇత్తడి గంగాళాలన్నిటినీ చింతపండు పామి తోమింది... అవన్నీ తోమి, తోమి చేతులు మంటగా ఉన్నాయి... కానీ, అలా అని అమ్మగారికి చెప్పలేదుగా... మౌనంగా వంగి ఆ గిన్నెలను తనవైపు జరుపుకుని, తీసుకుంది పార్వతి...

లోపలి నుంచి కమ్మటి వాసనలు వస్తున్నాయి... లడ్డు పాకం పడుతున్న చక్కెర వాసన... పార్వతి పేగులు ఆశగా కదిలాయి... ఇవాళ పండగ... అయ్యగారికి అరవై ఏళ్లు నిండాయిట... ఇవాళ, అయ్యగారికి, అమ్మగారికి మళ్లీ పెళ్లి చేస్తారుట... వారం రోజుల నుంచీ ఈనాటి పండగ కోసం ఇంట్లో ఆర్భాటం, హడావుడి, చర్చలు, ఎవరెవరిని పిలవాలి? ఏమేం వంటలు చేయించాలి? ఎలా చేయించాలి? అని తర్జనభర్జనలు జరుగుతున్నాయి. ఈ పండగ సందర్భంగా ఇంట్లో సత్యనారాయణస్వామి కథ కూడా చెప్పిస్తారుట... ఆ కథంటే పార్వతికి చాలా ఇష్టం... ఇదివరకు కూడా రెండుసార్లు అమ్మగారు ఇంట్లో ఈ కథ చెప్పించారు... అనేక కష్టాలు పడ్డవాళ్లంతా ఆ కథ చెప్పించుకుంటే ఆ కష్టాలు తీరాయి కథలో... అమ్మగారు వాళ్లు కూడా ఎంతో సంతోషంతో ఉంటారు ఎప్పుడు చూసినా...

పార్వతి చిన్న మనసులో హఠాత్తుగా ఓ అనుమానం కలిగింది... అమ్మ ఎందుకు ఈ కథ చెప్పించలేదింట్లో... అలా చేసి ఉంటే తమ కష్టాలు కూడా తీరేవిగా... ఇవాళ, గుప్పెడు మెతుకుల కోసం తనకీ బండపని చేసే ఖర్మ, వీళ్లు జాలితలిచి పెట్టే ఎంగిలి మెతుకులు తినే ఖర్మ ఉండేది కాదుగా... నాన్న అమ్మని వదిలేసి వెళ్లిపోయేవాడు కాదుగా... కనీసం వెళ్లిపోయాకనైనా ఈ కథ చెప్పించి ఉంటే తిరిగి వచ్చేవాడుగా... తననీ, తమ్ముడినీ, అక్కనీ, అమ్మనీ ప్రేమగా చూసేవాడు... తమ గుడిసె దగ్గరే ఉండే రాములమ్మ పిల్లల్లాగా తనూ, అక్కా, తమ్ముడూ కూడా స్కూలుకు వెళ్లేవాళ్లు, అక్కడ మధ్యాహ్నం స్కూలు వాళ్లు పెట్టే అన్నం తినేవాళ్లు... ఎంత బాగుండేది! అమ్మకి బహుశా తెలియదేమో... అమ్మ ఎప్పుడూ విని ఉండదు... ఎన్నాళ్ళయింది అమ్మనీ, అక్కనీ, తమ్ముడినీ చూసి... అమ్మా, అక్కా ఆ పల్లెటూళ్లో దొరగారింట్లో పని చేస్తున్నారుట... తమ్ముడిని ఎవరో పెద్దింటివాళ్లు తీసికెళ్లారుట... వాడిని కూడా ఏడాదికోసారి రెండు రోజుల కోసం పంపిస్తారుట అమ్మ దగ్గరకు... అమ్మ ఉత్తరం రాసింది... కానీ, తను ఈ ఇంటికి వచ్చి రెండేళ్లు అవుతోంది.., ఇంతవరకు మళ్లీ అమ్మ దగ్గరకు వెళ్లలేదు... ఒకసారి అమ్మగారిని ఊరు వెళతానని అడిగితే, "ఎక్కడికే వెళ్లేది? వెళ్లి అక్కడ ఏం తింటావు? మీ అమ్మకే గతిలేదు... నీకేం పెడుతుంది... హాయిగా కడుపులో చల్ల కదలకుండా ఇక్కడ ఉండక వెళ్తానంటావేం? మీ అమ్మనే రమ్మని ఉత్తరం రాయి, వచ్చి చూసి వెడుతుంది..." అంటూ గదిమింది భ్రమరాంబ... అసలు సంగతి అది కాదు... తను వెళితే, ఇంట్లో పని చేసే వాళ్లు ఉండరు... ఆవిడ మనవడిని స్కూల్లో దింపేవాళ్లు, తీసుకొచ్చేవాళ్లు ఉండరు... ఏడాది వయసున్న మనవరాలిని ఎత్తుకుతిప్పేవాళ్లు, ఆడించేవాళ్లు ఉండరు... ఈ పనులన్నీ తానే చేయాలి.. మనవరాలి పేరు ఆర్తి... ముద్దుగా, బొద్దుగా ఉంటుంది... ఆ పాపని ఆడించడం ఒక్కటే తనకిష్టమైన పని... ఇంక మిగతా పనులన్నీ అయిష్టంగా, బలవంతంగా చేస్తోంది. ఆకలికి ఆగలేక, అన్నం కోసం చేస్తోంది... రెండు పూటలా, మిగిలిన చద్దన్నం, అంతో ఇంతో మిగిలిన పప్పు, ఇంత పచ్చడి వేసి అమ్మగారు అన్నం పెడతారు... ఆ అన్నం కోసం ఎంత పనైనా చేయాలనిపిస్తుంది... ఏం చేయాలి మరి? అన్నం ఎవరు పెడతారు? ఆ అన్నం లేకేగా... రోజులకి రోజులు రాములమ్మ వార్చిన గంజినీళ్లు అడుక్కొచ్చి తాగేవాళ్లు... ఈ పని

మానేస్తే మళ్లీ ఆ గంజే దిక్కేమో అని భయం వేస్తుంది... గంజి తాగితే ఆకలే తీరదు... నీరసం వస్తుంది... ఇప్పుడు చక్కగా అన్నం తింటోంటే హాయిగా ఉంది... పచ్చడి మెతుకులు కూడా పార్వతికి రుచిగానే ఉన్నాయి. అమ్మగారు వాళ్లు రెండు కూరలు, పప్పు, పెరుగు, పచ్చడి వేసుకుని తింటారు... మధ్య, మధ్య పళ్లరసాలు తాగుతారు... తనకీ పళ్లరసం తాగాలనీ, పండు తినాలనీ అనిపిస్తుంది... వాళ్లు రసం తీసుకుని, పారేయమని ఇచ్చిన బత్తాయి చెక్కలు వలుచుకు తింటుంది పార్వతి... అవే ఆ పిల్లకెంతో రుచిగా అనిపిస్తాయి.

"ఎంతసేపే... అయిందా?" భ్రమరాంబ స్వరంతో ఉలిక్కిపడి, తోమిన గిన్నెలు చకచకా కడిగి లోపల పెట్టింది..." వాకిలూడ్చి ముగ్గేసిరా... త్వరగా చేయి పనులు... జాగుచేయకు... ఈలోగా పిల్లలు లేస్తారు... గదులు తుడిచెయ్.. ఎక్కడికి? వంట గదిలోకి వస్తావా? వెళ్లు దూరంగా ఉండు... ఆ గిన్నలక్కడ పెట్టు... నేను తొలచి తీసుకుంటా..." గబ గబా పెద్ద స్వరంతో అరుస్తూ చేయాల్సిన పనులు పురమాయించింది...

భ్రమరాంబది పెద్ద గొంతు... ఆవిడ మాట్లాడినా అరిచినట్టే ఉంటుంది... ఆవిడ భర్త అచ్యుతరామయ్యకి ఫర్నిచర్ షాపుంది... మూడు పూలు, ఆరు కాయలుగా ఆయన వ్యాపారం సాగుతోంది... మార్కెట్‌లోకి కొత్త ఫర్నిచర్ వచ్చిందంటే ఈయన షాపుకి రావాల్సిందే. జనం... విదేశాల నుంచి కూడా కావలసిన బ్రోచర్స్ తెప్పించుకుని డిజైన్ చేస్తుంటాడు... ఆడిపిల్లలిద్దరూ ఒకళ్లు, కాలిఫోర్నియాలో, ఒకరు న్యూజెర్సీలో ఉన్నారు... మగపిల్లాడు సత్యం కంప్యూటర్‌లో మంచి పదవిలో ఉన్నాడు... కోడలు కూడా ఇంజనీరే... ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో చేస్తోంది... కొడుక్కి ఇద్దరు పిల్లలు... ఆ పిల్లలను చూసుకోడానికి భ్రమరాంబ చేతకాక, తన తల్లిగారి ఊరైన రేపల్లె నుంచి పాలేరు కూతుర్ని తెచ్చుకుంది... సంవత్సరానికి నాలుగు వేలు, రెండు పూట్లా తిండి, ఇంట్లో ఆశ్రయం అనే కండిషన్ మీద తెచ్చుకుంది. పార్వతి తండ్రి సోమరిపోతు, తాగుబోతు... భార్యనీ, పిల్లల్నీ వదిలి చాలాకాలం క్రితమే ఎటో వెళ్లిపోయాడు. అప్పటికి పార్వతికి ఐదేళ్లు... దాని తమ్ముడికి రెండేళ్లు... అప్పట్నించీ ఆ తల్లే ఆ పనీ, ఈ పనీ చేస్తూ పిల్లల్ని పోషించింది... కానీ, రాను రాను ఆమెకి చేతకాక, పిల్లలకి కడుపు నిండా తిండి పెట్టలేక, కొడుకునీ, చిన్న కూతుర్నీ అడిగిన వాళ్లకి పనిపిల్లలుగా పంపించింది... ఇప్పటికి పార్వతి ఆ ఇంటికి వచ్చి మూడేళ్లు దాటుతోంది... భ్రమరాంబకి అలంకారాలు, ఆభరణాలు అంటే చాలా ఇష్టం... ఎప్పుడూ నిండుగా అలంకరించుకుని, ఉన్న బంగారం అంతా వంటిమీద దిగేసుకుని, పార్వతికి

## బావుణ్ణు

విమాన వేగంతో
విశ్వమెల్ల చూద్దామంటే
ఉల్లి తెరలకే
కళ్ళు రగులుతున్నాయి.
వేయి వోల్టుల మినుకుడు పురుగునై
చిమ్మ చీకట్లు ఛేదించి
రతనాల నేరుద్దామంటే
మెరుగు తీగెల ముందు.
వెలుగు దిగదుడుపై పోతుంది.
చేటంత చెవ్వులు పెంచి
వేల స్వరాల విందామంటే
చీమ చిటుకుమన్న శబ్దాన్నే
కర్ణభేరి భరించనంటోంది
కణం నుండి జనింపజేసే
కృత్రిమత్వం కాదు గాని
సృజనత్వం సహజమై
మనిషి ఎదిగిపోయి
మనసు మహా సముద్రమైపోతే బావుణ్ణు.
అది రాలిన తెరువును
పయనించే దిశను
పసికట్టే నైజం తెలిస్తే బావుణ్ణు.

–పూట్ల భద్రయ్య

ఆ పనీ, ఈ పనీ పురమాయిస్తూ, ఇంటినీ, ఇంట్లోవాళ్లనీ చిటికెన వేలిమీద ఆడిస్తూ ఉంటుంది... అచ్యుతరామయ్య వ్యాపారం విషయాలే గానీ, ఇంటి విషయాలు పట్టించుకోడు.. కొడుకూ, కోడలు పొద్దున వెళితే రాత్రిగ్గానీ రారు... అంతా ఈవిడదే రాజ్యం... ఆవిడే పెత్తందారీ. దానికి తగ్గట్టు ఆవిడకి చాలా పెద్ద గొంతు ఇచ్చాడు భగవంతుడు... ఆ గొంతుతో ఆవిడ ఏం చెప్పినా అవతలివాళ్లు భయంతో గజగజలాడాలి... ముఖ్యంగా పనివాళ్లు... పార్వతిక్కూడా ఆ గొంతంటే చచ్చే భయం... ఆవిడకి మడీ, శుచీ, శుభ్రతా ఎక్కువ... కొందరికి అవి చాదస్తంగా అనిపిస్తాయి. మరికొందరికి మూర్ఖంగా అనిపిస్తాయి... కానీ ఆవిడకి అవి చాలా మంచి లక్షణాలుగా అనిపిస్తాయి. వాటిలో ముఖ్యమైంది పనివాళ్లను లోపలికి రానివ్వకపోవడం... వాళ్లు స్నానం చేయకుండా ఏ పనీ చేయనివ్వకపోవడం... కేవలం గదులు, అవి కూడా బెడ్ రూమ్స్, హాలు మాత్రమే, తప్ప వంట గదివైపు కానీ, భోజనాల గదివైపు కానీ రాకూడదు... ఆ పని తనే చేసుకుంటుంది... ఆవిడ సన్నగా, పొడుగ్గా ఉంటుంది. మంచి ఓపిక గల మనిషి... ఇంట్లో ఏ పండగైనా, ఫంక్షన్ అయినా, వంటవాళ్లను పెట్టుకుని అజమాయిషీ చేస్తూ వంటలు చేయిస్తుంది. క్యాటరింగ్ ఒప్పుకోదు. వాడే గుడ్డలతో వండుతాడో... పైగా కంచాలు లెక్కపెట్టుకుని డబ్బులు తీసుకుంటాడు... పదిమంది ఉన్న ఇల్లు, నలుగురు ఎక్కువ రావచ్చు, నలుగురు తక్కువ రావచ్చు... క్యాటరింగేంటి? హాయిగా ఇంత పెద్ద ఇల్లుంచుకుని, ఇంట్లో కావల్సినవి వండించుకోక అంటూ వండించడమే చేస్తుంది... పిల్లలు, ముఖ్యంగా కూతుళ్లు అమెరికా నుంచి వచ్చినపుడల్లా "ఏంటమ్మా ఈ చాదస్తం" అంటే "మీకెందుకే... వెళ్లి హాయిగా మేడమీద కూర్చోండి... కమ్మటి వంటలు పెడతాను" అంటుంది... చివరికి పిల్లల పుట్టిన రోజులు మాత్రం హోటళ్లలో చేయడానికి ఒప్పుకుంది... ఈ విధంగా భ్రమరాంబ అజమాయిషీలో ఆరోజు వంటలన్నీ పూర్తి అయి, సత్యనారాయణవ్రతం ప్రారంభం అయింది. స్నేహితులు... పరిచయస్థులు, బంధువులతో ఇల్లంటా కిటకిట లాడుతోంది... వాకిలి ముందు షామియానా వేయించారు... వచ్చిన వాళ్లంతా ఖరీదైన బహుమతులు తెచ్చారు. అమెరికా అమ్మాయిలు, వాళ్ల పిల్లలు ఖరీదైన బట్టల్తో, ఖరీదైన నగలతో, అంతకన్నా ఖరీదైన డ్రై ఫ్రూట్స్, పళ్లు తినో, లేక అమెరికా వాతావరణానికో తెల్లగా మెరిసిపోతూ అటూ ఇటూ తిరుగుతూ వచ్చిన వాళ్లను పలకరిస్తూ అమెరికా కబుర్లు చెపుతూ తుళ్లుతున్నారు...

పార్వతి అందరికీ కూల్ డ్రింకులు, కాఫీలు, టిఫిన్లు అందిస్తూ, మధ్యమధ్య అమ్మగారి, మనవరాలిని ఆడిస్తూ, పాప పాడుచేసిన బట్టలు మారుస్తూ బిజీగా వుంది... చక్రంలా తిరుగుతోంది... బొంగరంలా తిరుగుతోంది... మౌనంగా, చెవులు కథమీద వేసి, కళ్లు, ఖరీదైన బట్టలవైపు ఆశగా వేసి, నాసికా పుటాలకు తగులుతోన్న రకరకాల వంటల పరిమళాలను ఆస్వాదిస్తూ, మరబొమ్మలా చేతులూ, కాళ్లూ కదిలిస్తూ పనులు చేస్తోంది. ఉదయం తాగిన ఓ కప్పు టీ తప్ప కడుపులో ఏం లేదు... బంధువులకీ, స్నేహితులకీ బతిమాలి, బామాలి జీడిపప్పు ఉప్మా పెట్టిస్తున్నారే గానీ, ఎవరూ పార్వతికి ఓ విస్తరాకులో ఇంత ఉప్మా వేసి తినమన్నవాళ్లు లేరు... చాలాసేపటిదాకా ఆ ఉప్మా చూసి ఆకలితో అరిచిన పేగులు, నీరసించి నిస్త్రాణగా ఉండిపోయాయి... పోనీలే... కాస్సేపయాక పూజ అయాక అన్నం తినచ్చు... రోజూ పచ్చడి మెతుకులు సరిపోతున్నాయి. ఇవాళ ఎంచక్కా రకరకాల వంటలు తినచ్చు... నచ్చచెప్పుకుంది కాలే కడుపుకి...

పూజ అయింది... ప్రసాదం, తీర్థం ఇస్తున్నారందరికీ... అందరూ లైనుగా వెళ్లి తీసుకుంటున్నారు... పార్వతి చేతిలో పాపని పట్టుకుని నిలబడింది. అందరూ అయాక తనూ తీసుకోవచ్చునన్నట్టుగా తన వంతు కోసం ఎదురుచూస్తూ... పాప తల్లి వచ్చి, పాపను అందుకుంది... "చిట్టితల్లీ దా ప్రసాదం

తిందువుగానీ... జేజి ప్రసాదం" అంటూ లోపలికి తీసికెళ్లింది... పార్వతి అలా నిలబడి ఉంది... అందరూ అయిపోయారు... పార్వతి కూడా తన ముందు నిలబడిన ఇద్దరి తరవాత తన వంతు కోసం చూస్తోంది... కళ్లు తిరుగుతున్నాయి... ప్రసాదం నోట్లో వేసుకుంటే కాస్త నెమ్మదిస్తుంది అనుకుంది.

"ఒసేయ్... ఎక్కడికే నువ్వు... నీకూ తొందరేనా? కాస్సేపాగలేవూ... తగుదునమ్మా అని పూజ దగ్గరకి అలా వచ్చేయడమే... వెళ్లవతలికి... టేబిల్స్ శుభ్రంగా తుడువు... భోజనాల వేళైంది..." అంటూ వంటగదివైపు వెళుతోన్న భ్రమరాంబ గట్టిగా అరిచింది... ఉలిక్కిపడిన పార్వతి "పెసాదం అమ్మగారూ!" అన్నది గొణిగినట్టుగా...

"ఏం? నీకర్జంటుగా పుణ్యం కావాల్సి వచ్చిందా? తరవాత తిందువు గానిలే... ఎక్కడికి పోతావ్?" ఎగతాళిగా అంటూ వెళ్లిపోయింది...

పార్వతి సన్నగా నిట్టూర్చి, షామియానాలో వేసిన టేబిల్స్ దగ్గరకు నడిచి, బట్టతో దుమ్ము తుడవసాగింది... ఎవరో నలుగురు కుర్రాళ్లు చేతిలో పెద్ద తెల్లకాగితం ఉండ తీసుకొచ్చి, టేబిల్స్ మీద పరిచారు... మరి ఇద్దరు గ్లాసులు, అరిటాకులు వేసారు... ఒక కుర్రాడు పార్వతిని చూస్తూ... "ఏయ్... ఆ అరిటాకులు తుడువు అన్నాడు..." పార్వతి ఒక్కో అరిటాకే తుడుస్తూ ఆకలిని అణచుకోడానికి ప్రయత్నించసాగింది... నెమ్మదిగా వడ్డన ప్రారంభం అయింది. అతిథులంతా వచ్చి, కుర్చీల్లో కూర్చున్నారు. ఉప్పుతో మొదలైన వడ్డన, గారెలు, బూరెలు, లడ్డు, బజ్జీ, పులిహోర, పాయసం, వంకాయ కూర, ఆలుగడ్డ వేపుడు, జిలేబి, పప్పు, తెల్లటి మల్లెపూవులాంటి అన్నం, నెయ్యి. అలా సాగుతోంది... పార్వతి షామియానాకి అవతల నిల్చుంది. వడ్డన ప్రారంభం కాగానే ఆ పిల్లని అవతలికి తరిమేశారెవరో- ఆ పిల్ల కళ్ళ నిండుగా వున్న అరిటాకుల వైపు వున్నాయి. అణిగిపోయిన ఆకలి ఒళ్ళు విరుచుకుని విజృంభించింది. జీవితంలో ఎప్పుడూ తినలేదు. ఇలాంటి వంటలు అప్పుడప్పుడూ ఫంక్షన్‌లలో ఫలహార, పాయసం పెట్టారు కానీ, ఇవన్నీ ఎప్పుడూ పెట్టలేదు... ఇంకేవో స్వీటులు, ఐస్‌క్రీమ్‌లు పాప పుట్టినరోజుకి హోటల్లో అందరికీ పెట్టించారు... కానీ, తనకి ఆరోజు ఇంట్లోనే చద్దన్నం పెట్టి, తీసికెళ్లారు... చివరకు ఫంక్షన్ అంతా అయి వచ్చేటప్పుడు భ్రమరాంబ అదేదో కాజా అంటూ ఒకటి చేతిలో

## నిలబడనియ్

గది కిటికీ నుండి దూసుకువస్తున్న
నీ గుండె వాంఛానల కీలలు
అయోమయానందంతో నాలోని అణువులు
జడ చైతన్యాలు యేకమై ఆనంద నర్తనలు.
ఒంటరి బల్లి కీక్‌మంటూ యిటునటు వురకలు.
వాంఛల గాయాలతో నీరయిన నా గుండె
చిల్లులు పడ్డ మేఘంలా కురుస్తున్నది.
ఎన్నో జన్మల తర్వాత
నీ కరుణ గంధాన్ని అనుభూతిస్తున్నాను.
నీ అంతరంగార్ద్రత
వాంఛలై... అసంతృప్త వాసనలై
నన్ను బందీని చేసింది.
అందమైనదీ విలా యీ పంజరం
ఎన్ని జన్మల నిరీక్షణ
యాతన... తపన... యాతనా తపన.
దీవిని ముంచుతూ వాంఛా తరంగాలు
మట్టి దీవి... మునిగిపోనియ్.
అనంత వాంఛా సముద్రంలో
కరిగిపోనియ్.
అయితే... ఒక ప్రార్థన
ఒక్క జ్ఞాపకాన్ని
నిలువెత్తు రాయిలా... నిటారుగా
దీప పుంజంలా... నాటనియ్.
నీ కోరికలతో తడిసిన
నా జ్ఞాపకాన్ని
దారితప్పిన సాగర నావికులకు
ధృవతారగా నిలబడనియ్.

-మునిసుందరం

పెట్టి "తినవే" అన్నది. ఆ మాత్రానికే పొంగిపోయింది పార్వతి...

వాళ్లంతా హోటల్లో తింటూ తనకి ఎందుకు చద్దన్నం పెట్టారో అర్థం కాలేదు. అంతేనేమో అలాగే పెడతారు కాబోలు అనుకుంది. హమ్మయ్య ఇన్నాళ్లకి, పుట్టిన ఇంతకాలానికి తను చాలా పదార్థాలు తినగలుగుతోంది... వీటిల్లో కొన్ని దాచుకుని, అమ్మ వస్తే పెట్టాలి... కానీ ఎలా దాచుకోవాలి? పార్వతికి అర్థం కాలేదు... అమ్మా, అక్కా తమ్ముడు గుర్తొచ్చారు... పాపం వాళ్లు ఇంకా గంజే తాగుతున్నారేమో... తను కనీసం ఇవాళన్నా ఇవన్నీ తినగలుతుంది... కానీ, వాళ్లు ఎప్పటికీ తినలేరేమో... వాళ్లందరి మీదా జాలితో పార్వతి గుండె ద్రవించింది.

"ఏయ్... వచ్చి ఆకులు తీసెయ్..." పాప తల్లి పార్వతిని కేకేసింది.

పార్వతి నుంచున్న చోటి నుంచి కదిలింది... ఆకులు తీస్తోంటే, ఆకుల్లో వదిలేసిన లడ్డు, జిలేబీ, గారెలు ఒక కుర్రాడు తీసి, చిన్న గిన్నెలో వేశాడు...

పార్వతి చకచకా అంతా క్లీన్ చేసింది... రెండో రౌండ్ మొదలైంది. అలా నాలుగు రౌండ్లు పూర్తయాక గానీ ఇంట్లో వాళ్లతో సహా అందరి భోజనాలు పూర్తికాలేదు...

పార్వతి రౌండు, రౌండుకీ ఆకులు తీయడం, డిస్పోజబుల్ గ్లాసులు తీసి పారేయడం, అంతా క్లీన్ చేయడం చేస్తోంది... అప్పటికి టైం మూడున్నర... ఆఖరి రౌండు పూర్తయింది. కళ్లు తిరుగుతున్నాయి... కాళ్లు శక్తి కోల్పోయాయి. చేతులు ఇంక పనిచేయంలేము అంటూ మొరాయిస్తున్నాయి... కడుపులో పేగులు అరిచి, అరిచి శోషొచ్చి పడుకున్నాయి... అన్ని అవయవాలనూ బుజ్జగిస్తూ, తినబోయే పదార్థాలను తలచుకుంటూ పనిచేస్తోంది పార్వతి...

లోపలి నుంచి భ్రమరాంబ గుమ్మంలోకి వచ్చి, "ఒసేయ్ రా అన్నం తిందువుగానీ" అన్నది.

నీరసించి సొమ్మసిల్లిన అవయవాలన్నీ హుషారుగా లేచాయి. చైతన్యం నింపుకుని పనిచేయడం ప్రారంభించాయి. పార్వతి ఉత్సాహంగా పంపుదగ్గరకు వెళ్లి శుభ్రంగా కాళ్లూ, చేతులూ కడుక్కుంది... చీకటి గదిలోకి వెళ్లి టవల్ తీసుకొని తుడుచుకుంది. కళ్లల్లో తినబోయే పదార్థాలను నింపుకుని పెరటి గుమ్మం దగ్గరకు వచ్చి "అమ్మ గారూ" అంటూ పిలిచింది.

"ఆ వస్తున్నా" అంటూ భ్రమరాంబ చేతిలో విస్తరాకుతో వచ్చి "రా తిను..." అంటూ విస్తరి తలుపుదగ్గర పెట్టింది. పార్వతి ఆనందంగా విస్తరి అందుకుంటూ ఆ విస్తట్లో ఉన్న పదార్థాలు చూడగానే తెల్లమొహం వేసింది... చెంచాడు పప్పు, రెండు ఆలుగడ్డ ముక్కలు, ఆవకాయ, చద్దన్నం... పార్వతి కళ్లల్లో కన్నీళ్లు తిరిగాయి. నిలువునా నీరసం ఆవహించింది... నీరసంతో వణుకుతోన్న చేతుల్తో ఆకు తీసుకుని అరుగుమీద చతికిలబడింది... అన్నం మెతుకులు మేకుల్లా ఉన్నాయి. మింగుడు పడడంలేదు. దుఃఖం గొంతుకు అడ్డం పడుతోంది. బలవంతంగా తినడానికి ప్రయత్నిస్తోంది. లేచి తనకి ఇచ్చిన గ్లాసుతో నీళ్లు తెచ్చుకుంది. ముద్ద ముద్దకీ, ఒక్కో చుక్క నీళ్లు గొంతులో పోసుకుంటే తప్ప ముద్ద గొంతులోకి దిగడం లేదు. భ్రమరాంబ స్వరం వినిపించింది. "ఏవన్నా కావాలంటే అడగవే... కాస్త పచ్చడేయనా?..."

పార్వతి సమాధానం చెప్పలేకపోయింది.

"ఏవిటో అనుకున్నదానికన్నా ఎక్కువమంది వచ్చారు. పదార్థాలు సరిపోలేదు చూశావా? ఇంకా చుట్టుపక్కలవాళ్లు రావాలి... సాయంత్రం వస్తారేమో... కాస్త టిఫినన్నా పెట్టకపోతే బాగుంటుందా? ఇంకా నయం పులిహోర, జిలేబీ, లడ్డు మిగిలాయి... వాళ్లకి టిఫిన్లకి సరిపోతాయి..." భ్రమరాంబ కోడలితో అంటోన్న మాటలు వినిపించాయి. పార్వతికి కన్నీళ్లు ధారగా కారాయి.

"ఏవే... ఏం కావాలి" మరోసారి భ్రమరాంబ స్వరం వినిపించింది.

"ఏ... ఏం వద్దమ్మగారూ... కడుపు నిండిపోయింది..." బలవంతంగా గొంతు పెగల్చుకుని సమాధానం చెబుతూ, గుక్కెడు మంచినీళ్లతో పాటు కన్నీళ్లు కూడా మింగేసింది. ●